సాక్షి అనకాపల్లి

సోమవారం । 24 । మార్చి । 2025




కదం తొక్కిన కాంట్రాక్టు కార్మికులు

ఉక్కులో కాంట్రాక్టు కార్మికుల తొలగింపును నిరసిస్తూ ఆదివారం భారీ పాదయాత్ర నిర్వహించారు. 8లో



ట్రాలీ లారీ బీభత్సం

మాడుగుల మండలం గాదిరాయిలో లారీ ఆదివారం మూడు ద్విచక్రవాహనాలను ఢీకొట్టడంతో ఐదుగురు గాయపడ్డారు. 8లో



రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహర్
	సోమ	మంగళ
అనకాపల్లి	6.13	4.42
నర్సీపట్నం	6.16	4.40

న్యూస్‌రీల్

గవర్నర్‌కు స్వాగతం



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న అధికారులు

గోపాలపట్నం(విశాఖ): రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ దంపతులు ఆదివారం సాయంత్రం విశాఖ చేరుకున్నారు. విమానాశ్రయంలో కలెక్టర్ హరేందిర ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, డీసీపీ–2 మేరి ప్రశాంతి, గాజువాక, గోపాలపట్నం తహసీల్దార్లు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. సోమవారం విశాఖలోని వైఎస్సార్ ఏడీఏ వీడీసీఏ స్టేడియంలో జరగనున్న లక్నో సూపర్ జెయింట్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరగనున్న ఐపీఎల్ మ్యాచ్‌ను వీక్షించనున్నారు.

ఒలింపియాడ్‌లో కీర్తనకు రెండో ర్యాంకు



రావికమతం : నేషనల్ ఇంగ్లీషు టాలెంట్ టెస్టులో మరుపాక మోడల్ స్కూల్ విద్యార్థిని కె.కీర్తన రెండో ర్యాంక్ సాధించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 24 న ఆంధ్ర, తెలంగాణలో వివిధ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఒలింపియాడ్ నిర్వహించిన ఇంగ్లిష్ టాలెంట్ టెస్టులో పాల్గొన్నారు. వీటి ఫలితాలు ఆదివారం విడుదల చేయగా వాటిలో మోడల్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న కీర్తన రెండవ ర్యాంక్ సాధించింది. దీంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. కీర్తనను ఉపాధ్యాయులు ,తదితరులు అభినందించారు.

ఆల్ట్రా డీలక్స్‌కే... వన్ మ్యాన్ సర్వీసు..



దీక్షా శిబిరంలో కూర్చున్న ఆర్టీసీ కార్మికులు

అనకాపల్లి టౌన్ : వన్ మ్యాన్ సర్వీసులను ఇతర డిపోల వలే ఆల్ట్రా డీలక్స్ సర్వీసు వరకు మాత్రమే పంపాలని ఎన్ఎంయూఏ రీజనల్ సెక్రటరీ పి. సుధాకర్ తెలిపారు. స్థానిక ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ ఎదుట చేస్తున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 23వ రోజుకు చేరుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ అకారణంగా సస్పెండ్ చేసిన ఉద్యోగులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలన్నారు. జోనల్ జాయింట్ కార్యదర్శి జి. శంకర్రావు మాట్లాడుతూ 1–2019 సర్క్యులర్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో బాబు, వేపాడ శ్రీను, ఈఎస్ఆర్ మూర్తి వర్మ, కార్మికులు పాల్గొన్నారు.

జీవ వైవిధ్యాన్ని కాపాడాలి



పక్షులకు తాగునీరు, తిండి ఆవశ్యకతపై వివరిస్తున్న గ్రీన్‌క్లబ్ సభ్యులు


అనకాపల్లి టౌన్ : ప్రతీ ఒక్కరూ సమస్త జీవవైవిధ్యాన్ని కాపాడాలని గ్రీన్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ అన్నారు. పట్టణంలోని పలు దేవాలయాల్లో ఎండ తీవ్రత దృష్ట్యా పక్షులకు ధాన్యపు కుంచెలు, మట్టి ప్రాతల్లో తాగునీరు, పక్షులకు గూళ్లు ఏర్పాటు చేసే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ రెండో వారంలో పట్టణంలో పార్కుల్లో ఈ కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీ సీఎం రమేష్ వ్యక్తిగత సహాయకుడు విజయ్‌నాయుడు, దేవస్థానాల చైర్మన్‌లు కాండ్రేగుల సత్యన్నారాయణ, బొడ్డేడ మురళి, బి.ఎం.ఎస్.కె జోగినాయుడు, పెంటకోట ఉమామహేశ్వరావు, యల్లపు సూరి అప్పారావు, వంకాయల ఈశ్వరావు పాల్గొన్నారు.

చందనోత్సవం సీఎఫ్‌వోగా భ్రమరాంబ

సింహాచలం : సింహగిరిపై వచ్చే నెల 30న జరిగే చందనోత్సవానికి దేవదాయశాఖ తరపున చీఫ్ ఫెస్టివల్ అధికారిగా ఆ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ దర్భముళ్ల భ్రమరాంబ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం దేవదాయశాఖ ప్రధానకార్యాలయం అడిషనల్ కమిషనర్ టి.చంద్రకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె ప్రస్తుతం అమరావతిలో ఆర్‌జేసీగా ఉన్నారు.

విద్యార్థులకు కార్పొరేట్ గాలం

పదో తరగతి పరీక్షలు ముగియక ముందే కార్పొరేట్ విద్యాసంస్థల దందా మొదలైంది. హలో..సార్ మీ అమ్మాయి పదో తరగతిలో మంచి మార్కులు సాధిస్తుందని తెలుసుకున్నాం.. మా కళాశాలలో చేర్పించండి.. నాణ్యమైన బోధన ఉంటుంది..అంటూ తమ సిబ్బందితో విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ కాల్స్ చేసి వారిని అయోమయానికి గురి చేస్తున్నాయి. టెన్త్ వార్షిక పరీక్షలు పూర్తి కాకముందే పీఆర్ (పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్)లను రంగంలోకి దింపి విద్యార్థుల ఇళ్లకు పంపించి వారిని తమ కళాశాలల్లో ప్రవేశాలు తీసుకునేలా కార్యాచరణను గత మూడు నెలల నుంచే ముమ్మరం చేశాయి.



- ప్రారంభమైన ఇంటర్ అడ్మిషన్ల **దందా**
- టెన్త్ విద్యార్థుల కోసం ప్రైవేటు కళాశాలల గాలం
- పది పరీక్షలు పూర్తి కాకముందే తల్లిదండ్రులతో ఒప్పందాలు
- మెడికల్, ఇంజినీరింగ్ శిక్షణ ఇస్తామని ఎర
- నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్ల ప్రక్రియ
- ఉమ్మడి జిల్లాలో 63,735 **మంది** టెన్త్ విద్యార్థులు
- అధికారులు చర్యలు తీసుకో**వాలని** విద్యార్థి సంఘాల నేతల డి**మాండ్**

రూ.5వేలు నుంచి రూ.10 వేలు అడ్వాన్స్

కార్పొరేట్,పెద్ద ప్రైవేటు కళాశాలల్లో సీటు కావాలంటే కళాశాల యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి కోర్సు, శిక్షణను బట్టి రూ.5 వేలు నుంచి రూ.10 వేలు వరకు అడ్వాన్సుగా చెల్లించాలని తల్లిదండ్రులను ఒత్తిడి చేస్తున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు సీటు దొరకదేమోనన్న ఆతృత, ఫీజులో రాయితీ ఇస్తారన్న ఆశతో ముందుగానే సీటు బుక్ చేసుకుంటున్నారు. ఏసీ గదుల్లో తరగతులు, వసతి కావాలంటే రూ.30 వేలు నుంచి రూ.50 వేలు అడ్వాన్సుగా కట్టించుకుంటున్నారు. ముందస్తు అడ్మిషన్లు చేసిన పీఆర్వోలకు, **వారికి సహకరించిన** కొన్ని పాఠశాలల **యాజమాన్యాలకు**, ట్యూషన్ సెంటర్ల నిర్వా**హకులు, కొంతమ**ంది ప్రభుత్వ పాఠశాలల **ఉపాధ్యాయులకు** విందులు, నజరానాలు సైతం ఇస్తుండడం **అడ్మిషన్ల దందా** ఎలా కొనసాగుతోందో తెలియజేస్తోంది.

యలమంచిలి రూరల్ : ఏపీ పాఠశాల**ల్లో ఎంత మం**ది విద్యార్థులు పదో తరగతి పరీక్ష రా**స్తున్నారో వారి** సమాచారాన్ని ముందే సేకరించి కార్పొరేట్ కళాశాలలు అడ్మిషన్ల దందాకు తెర తీస్తు న్నాయి. ఆర్థిక స్థోమత బాగుండి, తమ కళాశాలలో చేరే అవకాశం ఉన్న వారికి గాలం వేస్తున్నారు. తమ కళాశాలల్లో చదివిన వారు డాక్టర్లు, ఇంజినీర్లు, ఐఏఎస్‌లు అయ్యారని ప్రచారం చేస్తున్నారు.

పీఆర్‌ల సందడి

జిల్లా, మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో పీఆర్‌వోల సందడి కనిపిస్తోంది. పదో తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల ఇంటికి వెళ్లి తమ కార్పొరేట్ కళాశాలల గొప్పతనం, ఇతర వివరాలు తెలియజేస్తున్నారు. ప్రధానంగా ఎంపీసీ, బైపీసీ కోర్సులతో పాటు మొదటి సంవత్సరం నుంచి ఇంజినీరింగ్, మెడిసన్, ఎయిమ్స్, ఐఐటీ జేఈఈ, గ్రూప్స్‌కు సంబంధించిన శిక్షణ ఇస్తామని చెబుతున్నారు. ఒక్కసారి మా కళాశాలలో మీ అబ్బాయి **లేదా అమ్మాయిని చేర్పిస్తే ఇక భవిష్యత్తుకు ఢోకా ఉండదని నమ్మబలుకుతున్నారు. ముందుగా బుక్ చేసుకుంటే ఫీజు రాయితీ ఉంటుందని, పదో తరగతి ఫలితాలు వచ్చిన తర్వాత ఫీజు పెరిగిపోతుందని, సీట్లు దొరుకుతాయో లేదో చెప్పలేమని తల్లిదండ్రులకు చెప్పి అడ్మిషన్లు చేయిస్తున్నారు.** ముందుగా సీటు రిజర్వ్ చేసుకోకపోతే కోరిన బ్రాంచిలో సీటు దొరకదని తల్లిదండ్రులను బెదరగొడుతున్నారు. దీంతో కార్పొరేట్ స్కూళ్లలో చదువుతున్న చాలామంది విద్యార్థుల తల్లిదండ్రులు విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు వంటి పట్టణాల్లో పేరు మోసిన కార్పొరేట్ కాలేజీల్లో ముందస్తు అడ్మిషన్లు పొందుతున్నారు.

టెన్త్ పరీక్షలు కాక ముందే..

పదో తరగతి వార్షిక పరీక్షలు ఈ నెల 17 నుంచి ప్రారంభమయ్యాయి. ఇంకా అవి పూర్తి కాకముందే కార్పొరేట్ కళాశాలలు ముందస్తు బుకింగ్‌లకు తెరతీశాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 63,735 మంది పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలకు హాజరవుతున్నారు. వాస్తవానికి ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం రాష్ట్ర ఇంటర్ బోర్డు ప్రతి ఏటా ప్రకటన విడుదల చేస్తుంది. ఆ ప్రకటనలో ప్రవేశాలకు **సంబంధించి నిర్ణీత షెడ్యూల్‌ను ప్రకటిస్తారు. దీని ప్రకారం ప్రవేశాల కోసం దరఖాస్తులు అమ్మకం దగ్గర్నుంచి ఎన్ని దశల్లో ప్రవేశాలు చేపట్టాలనే నియమ నిబంధనలన్నీ తెలియజేస్తారు. రాష్ట్రంలో గుర్తింపు పొందిన కళాశాలలన్నీ ఈ ప్రవేశ ప్రకటనను అనుసరించాలని నిబంధనలు చెబుతున్నాయి. కానీ** క్షేత్రస్థాయిలో ఇవేమీ అమలు కావడంలేదు. కార్పొరేట్, బడా ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలన్నీ గడచిన మూడు, నాలుగు నెలల నుంచే అడ్మిషన్ల వేట కొనసాగిస్తున్నారు. ముందస్తు అడ్మిషన్ల కోసం జోరుగా అడ్వాన్సులు కూడా కట్టించేసుకుంటున్నారు. ఈ ముందస్తు అడ్మిషన్ల ప్రక్రియ నిబంధనలకు విరుద్ధమంటూ ఇంటర్ విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. కానీ కార్పొరేట్ విద్యాసంస్థలు ముందస్తు అడ్మిషన్లు మొదలు పట్టినట్టు తెలిసినా సంబంధిత విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

త్వరపడొద్దు...

అయితే తల్లిదండ్రులు తొందరపడి నిర్ణయాలు తీసుకోవద్దని నిపుణులు సూచిస్తున్నారు. కార్పొరేట్ కళాశాలల్లో చేర్పించే ముందు పిల్లల అభిప్రాయాలతో పాటు, సదరు కళాశాలల్లో వసతులు, విద్యా బోధన, అనుమతులకు సంబంధించి **వీలైనంతగా తెలుసుకోవాలని సూచిస్తున్నారు. తమ వ్యాపారాభివృద్ధి, ర్యాంకుల కోసం నిత్యం విద్యార్థులను పుస్తకమే ప్రపంచం**గా మార్చే **కళాశాలలు** కొన్ని ఉన్నాయని, **వాటిలో చేర్పిస్తే విద్యార్థులు** ఒత్తిడికి గురై మానసికంగా, **శారీరకంగా** ఇబ్బందులు ఎదుర్కొనే **పరిస్థితులు వస్తాయని** హెచ్చరిస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధం



నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టకూడదు. ఇంటర్మీడియట్ విద్యామండలి ప్రవేశాల ప్రకటన జారీ చేసిన తర్వాతే ఆ షెడ్యూల్ ప్రకారం ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు చేపట్టాలి. ఎలాంటి ముందస్తు అడ్మిషన్లు చేయకూడదు. ముందస్తు అడ్మిషన్లపై విద్యార్థుల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. అలాంటి సమాచారం మాదృష్టికి తీసుకురావాలి. నిబంధనలు ఉల్లంఘించిన కళాశాలలపై చర్యలు తీసుకుంటాం.

– బి సుజాత, జిల్లా ఇంటర్ విద్యాధికారి

అధికారులు చర్యలు తీసుకోవాలి



కార్పొరేట్, కొన్ని ప్రైవేట్ కళాశాలలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పీఆర్‌వోలను నియమించుకుని ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం అన్వేషిస్తున్నారు. ఆఫర్ల పేరుతో తల్లిదండ్రులను మభ్యపెడుతున్నారు. ముందస్తు అడ్మిషన్లు చేయరాదని ప్రభుత్వ నిబంధనలున్నా వాటిని బేఖాతరు చేస్తూ విచ్చలవిడిగా అడ్మిషన్ల దందా కొనసాగిస్తున్నారు. అధికారులు నిబంధనలను పాటించని కార్పొరేట్ కళాశాలలను నియంత్రించాలి.

– మామిడి రమణ, ఎస్ఎఫ్ఐ, జిల్లా ప్రధాన కార్యదర్శి

ఫ్లై ఓవర్ వద్దే..వద్దు

- ఇప్పటికే కాలుష్యం బారిన అచ్యుతాపురం
- రింగు రోడ్డుతోనే ట్రాఫిక్ సమస్య పరిష్కారం
- భవన యజమానుల సంఘం నిరసన



నిరసన తెలుపుతున్న భవన యజమానుల సంఘం సభ్యులు

అచ్యుతాపురం రూరల్ : అచ్యుతాపురం కూడలిలో ఫ్లై–ఓవర్ నిర్మాణం చేయడం వల్ల మరింత కాలుష్యం పెరుగుతుందని అచ్యుతాపురం భవన నిర్మాణ యజమానుల సంఘం సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఫ్లై–ఓవర్ కారణంగా అచ్యుతాపురం గ్రామం పూర్తిగా కాలుష్యానికి గురై ప్రజలు అనారోగ్య పాలౌతారని గృహ నిర్మాణ యజమాన సంఘం సభ్యులు ఆదివారం జరిగిన సమావేశంలో అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయ రహదారులు నిర్మాణాలు చేసేందుకు ప్రతిపాదనలు ఉన్నప్పటికీ వాటి జోలికి పోకుండా ప్రజల ఆరోగ్య స్థితిగతులపై దెబ్బ తీసేవిధంగా అధికార యంత్రాంగం వ్యవహరిస్తుందని ఆరోపించారు. గ్రామంలో ఇప్పటికే ఉన్న సుమారు 200 పైబడి పరిశ్రమలకు చెందిన వాహనాలు రాకపోకల కారణంగా స్థానిక ప్రజలు వాయు, శబ్ధ కాలుష్యంతో అనారోగ్య ఇబ్బందులకు గురి అయ్యారన్నారు. సెజ్‌లో ఉన్నటువంటి పరిశ్రమలకు వాహనాలు రాకపోకలూ చేసేందుకు అచ్యుతాపురం చుట్టూ రింగ్ రోడ్డు నిర్మాణం చేపడితే అచ్యుతాపురంలో పూర్తి స్థాయిలో ట్రాఫిక్ నియంత్రణ చేయొచ్చునన్నారు. కోటి విద్యలు కూటి కోసమే అన్న చందాన ఎన్ని వ్యాపారాలు, ఉద్యోగాలు చేసినా ఆరోగ్యమైన జీవనం సాగించడానికే, అటువంటి ఆరోగ్యాన్ని అభివృద్ధి పేరుతో నిర్మిస్తున్న ఫ్లై–ఓవర్ కారణంగా ఛిద్రం చేయడం తగదన్నారు. సెజ్‌లో భూములు కోల్పోయిన నిర్వాసితులు ప్రభుత్వ పరిహారంతో ఎక్కువ శాతం అచ్యుతాపురంలో పూడిమడక రహదారిలో గృహ నిర్మాణాలు చేసుకున్నారని, ఇపుడు రెండోసారి అభివృద్ధి పేరుతో ఇక్కడి నిర్మాణాల కారణంగా కాలుష్యం పెరిగి వారంతా మరోచోటికి వెళ్లిపోయే పరిస్థితి నెలకొంటుందేమోనని ఆవేదన చెందారు. ఫ్లై–ఓవర్ కోసం చేస్తున్న విస్తరణల కారణంగా నివాస స్థలాలను, ఉపాధిని కోల్పోతామని భవన యజమానులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు పూర్తి స్థాయిలో పునరాలోచనతో స్థానిక ప్రజల స్థితిగతులను దృష్టిలో పెట్టుకుని ప్రత్యామ్నాయ రహదారులపై దృష్టి సారించాలని కోరుతున్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణాల సంఘం అధ్యక్షుడు దేశంశెట్టి అప్పలనాయుడు, ఉపాధ్యక్షుడు రాజాన సన్యాసినాయుడు, కార్యదర్శి బండారు కుమార్, గౌరవ అధ్యక్షుడు పల్లి శేషగిరి రావు, సహాయ కార్యదర్శి శరగడం శ్రీధర్, పంచదార్ల రవి, నీరుకొండ సూర్య చంద్రరావు, సీపీఎం నాయకులు జి.కోటేశ్వర్రావు, రొంగలి రాము, బుద్దా రంగారావు, మారిశెట్టి వెంకటప్పారావు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర హాకీ జట్టు శిక్షణకు ఇద్దరు యలమంచిలి క్రీడాకారులు





రాష్ట్ర హాకీ సీనియర్స్ జట్టు శిక్షణ శిబిరానికి ఎంపికైన యలమంచిలి క్రీడాకారులు కుసుమ కుమార్, ప్రసాద్

యలమంచిలి రూరల్ : ప్రతిభావంతులైన హాకీ క్రీడాకారులకు నిలయమైన యలమంచిలి పట్టణానికి చెందిన ఇద్దరు క్రీడాకారులు రాష్ట్ర హాకీ సీనియర్ జట్టు ప్రాబబుల్స్ బృందంలోకి ఎంపికయ్యారు. పట్టణానికి చెందిన బి.కుసుమకుమార్, జి.ప్రసాద్‌లను జిల్లా నుంచి రాష్ట్ర జట్టు ప్రాబబుల్స్‌కు ఎంపిక చేస్తూ సెలెక్టర్లు నిర్ణయించారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 35 మంది ప్రతిభావంతులైన క్రీడాకారులను రాష్ట్ర హాకీ సీనియర్ల జట్టుకు ప్రాతినిధ్యం వహించడానికి రాష్ట్ర హాకీ అసోసియేషన్ అధికారులు ఎంపిక చేశారు. వీరందరికీ ఈ నెల 25 నుంచి కాకినాడలో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరంలో తర్ఫీదునిస్తారు. 10 రోజుల శిక్షణ అనంతరం 18 మంది క్రీడాకారులను జాతీయ పోటీల్లో పాల్గొనే జట్టులోకి ఎంపిక చేస్తారని జిల్లా హాకీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కోఠారు నరేష్ ఆదివారం రాత్రి తెలిపారు. జిల్లా నుంచి ఎంపికైన క్రీడాకారులిద్దర్నీ నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అభినందించారు.

బలం లేకపోయినా అవిశ్వాసమా?

- మేయర్‌పై అవిశ్వాసం ఖండిస్తున్నాం
- దొడ్డి దారి రాజకీయాలు చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య
- మా పార్టీ కార్పొరేటర్లను బెదిరింపులు, ప్రలోభాలకు గురిచేస్తున్నారు
- వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ కన్నబాబు, చిత్రంలో మాజీ మంత్రి అమర్‌నాథ్, సమన్వయకర్తలు కేకే రాజు, భరత్, అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు ధర్మశ్రీ

సాక్షి, విశాఖపట్నం : గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌లో కూటమికి సంఖ్యా బలం లేకపోయినా.. మేయర్ పీఠంపై అవిశ్వాస తీర్మానానికి నోటీసులు ఇచ్చారని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు అన్నారు. ఆదివారం మద్దిలపాలెంలో గల పార్టీ కార్యాలయంలో శాసనమండలి విపక్షనేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అధ్యక్షతన వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు, సమన్వయకర్తలు, ముఖ్యనేతలతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటుచేశారు. అనంతరం కన్నబాబు మీడియాతో మాట్లాడుతూ దొడ్డిదారిన రాజకీయాలు చేయడం చంద్రబాబుకు, ఆ పార్టీ నేతలకు వెన్నతో పెట్టిన విద్యని, వైఎస్సార్ సీపీ గుర్తుపై గెలిచిన కార్పొరేటర్లను ప్రలోభపెట్టి, లొంగకపోతే భయపెట్టి బలవంతంగా లాక్కొంటున్నారని మండిపడ్డారు. కూటమి ప్రజాప్రతినిధులు చెప్పేవన్నీ శ్రీరంగనీతులు.. చేసేవన్నీ పనికిమాలిన రాజకీయాలంటూ మండిపడ్డారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, వైఎస్సార్ సీపీని అభిమానించే కార్పొరేటర్లంతా సమావేశానికి వచ్చారని.. కూటమి నేతలు ఎన్ని కుయుక్తులకు పన్నినా మేయర్ పీఠాన్ని కదపలేరన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న కూటమి ముఖ్యమంత్రి చంద్రబాబు ఇలాంటి కుళ్లు రాజకీయాలకు స్వస్తి పలకాలని చెప్పాలని హితవుపలికారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ జీవీఎంసీ ఎన్నికల్లో 58 స్థానాలను వైఎస్సార్ సీపీ కై వసం చేసుకుని మేయర్ పదవిని చేజిక్కించుకుందని, 30 స్థానాలు మాత్రమే గెలుచుకున్న టీడీపీ ఇప్పుడు మేయర్ పీఠాన్ని దక్కించుకోవాలనే దురాలోచన మానుకోవాలని హితవుపలికారు. కూటమి పార్టీలకు మెజారిటీ లేకపోయినా అవిశ్వాసానికి నోటీసు ఇచ్చారంటే.. తమ పార్టీ కార్పొరేటర్లను ఏవిధంగా భయపెడుతున్నారో.. ప్రలోభపెడుతున్నారో అర్థమవుతుందన్నారు. మేయర్ పీఠం ఎలా కాపాడుకోవాలనే దానిపై వ్యూహ రచనలు చేశామని, తప్పనిసరిగా కాపాడే ప్రయత్నం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఐపీఎల్ జోష్

నేడు లక్నో సూపర్ జెయింట్స్‌తో ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్



డీసీ ముమ్మర సాధన







విశాఖకు క్రికెట్ పండగ వచ్చేసింది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఐపీఎల్ మ్యాచ్‌లకు నగరం సర్వం సిద్ధమైంది. రాష్ట్రానికి ఫ్రాంచైజీ లేకపోయినా.. ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ) జట్టు వైఎస్సార్ ఏసీఏ–వీడీసీఏ స్టేడియంను తమ రెండో హోమ్ గ్రౌండ్‌గా ఎంచుకుంది. ఐపీఎల్ 18వ సీజన్‌లో భాగంలో సోమవారం రాత్రి 7.30 గంటలకు లక్నో సూపర్ జెయింట్స్‌తో ఢిల్లీ క్యాపిటల్స్ తలపడుతుంది. ఈ సీజన్‌లో ఇరు జట్లకు ఇదే తొలి మ్యాచ్ కావడం విశేషం. గత సీజన్లలో విశాఖ వేదికగా ఆరు ఫ్రాంచైజీ జట్లు ఆడగా, లక్నో సూపర్ జెయింట్స్‌కు మాత్రం ఇదే తొలి మ్యాచ్. మ్యాచ్ ప్రీ సెషన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ అక్షర్ పటేల్ మాట్లాడుతూ ప్రత్యర్థిని తక్కువ స్కోరుకే కట్టడి చేయడం తమ ప్రణాళికగా చెప్పారు. దీనిని బట్టి చూస్తే టాస్ గెలిస్తే ఫీల్డింగ్ ఎంచుకునే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. మొత్తానికి విశాఖ క్రికెట్ అభిమానులు ఈ ఉత్కంఠభరితమైన పోరు కోసం ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారు.

– విశాఖ స్పోర్ట్స్

ఐపీఎల్ మ్యాచ్‌కు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

అల్లిపురం: పీఎంపాలెంలోని డాక్టర్ వైఎస్సార్ వీసీఏ–ఏడీసీఏ క్రికెట్ స్టేడియంలో సోమవారం జరిగే క్రికెట్ మ్యాచ్‌కు ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. ఈ మేరకు ఏపీఎస్ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. గాజువాక, పాత బస్టాండ్, సింహాచలం, కూర్మన్నపాలెం నుంచి సుమారు 30 బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. రద్దీకి అనుగుణంగా బస్సుల పెంపు, తగ్గింపు ఉంటుందన్నారు. పోలీసు శాఖ ఆదేశాలతో విజయనగరం, శ్రీకాకుళం వెళ్లే బస్సులను సాయంత్రం 5 గంటల తర్వాత హనుమంతువాక నుంచి బీచ్‌రోడ్డు వైపు మళ్లిస్తామన్నారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

విశాఖలో సినిమా నిర్మిస్తే హిట్టే..

- బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేయడం నేరం
- 'అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి' చిత్ర హీరో ప్రదీప్ మాచిరాజు



విడుదల తేదీని చూపిస్తున్న హీరో హీరోయిన్లు ప్రదీప్, దీపక

అల్లిపురం: విశాఖలో ఏ చిత్రం నిర్మించినా విజయం సాధిస్తుందనే సెంటిమెంట్ తనకు ఉందని హీరో ప్రదీప్ మాచిరాజు అన్నారు. విశాఖ, అరకు పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరుపుకున్న ఆయన తాజా చిత్రం 'అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి'. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా ఆదివారం హీరోయిన్ దీపిక, యూనిట్ నగరంలో సందడి చేసింది. ఈ సందర్భంగా ఓ హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ప్రదీప్ మాట్లాడారు. లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం సిద్ధమైందన్నారు. ఉదిత్ నారాయణ్ ఆలపించిన 'ఎవ్వడో ఈడి కొచ్చినాడు సూడు'అనే సూపర్‌హిట్‌గా నిలిచిందన్నారు. ఏప్రిల్ 11న వేసవిలో విడుదల కానున్న ఈ చిత్రం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ రాసిన సాహిత్యం అద్భుతంగా ఉందని, సిద్ శ్రీరామ్ తన గాత్రంతో ఓ పాటను మరింత శ్రావ్యంగా ఆలపించారని కొనియాడారు. బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేయడం నేరమని ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు. హీరోయిన్ దీపిక మాట్లాడుతూ ఈ సినిమా కథ తన పాత్ర చుట్టూ తిరుగుతుందని, ప్రేక్షకులందరూ చిత్రాన్ని ఆదరించాలని కోరారు.

బాల వికాస గురువులతో పిల్లలకు సనాతన ధర్మం



మాట్లాడుతున్న అప్పలనాయుడు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని గాంధీనగరం సత్యసాయి మందిరంలో సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాలోని బాల వికాస గురువులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సత్యసాయి సంస్థల జిల్లా అధ్యక్షుడు కసిరెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ బాల వికాస గురువులు ద్వారా పిల్లలకు సనాతన ధర్మం, రామాయణం, భారతం, సంస్కృతీ సంప్రదాయాలు వంటి వివిధ అంశాలపై పాటలు, కథలు వివిధ రూపాల ద్వారా అవగాహన కల్పించి, భవిష్యత్‌లో వారు ఉన్నత స్థానాలకు చేరుకునే విధంగా విషయాలు బోధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి విద్యా విభాగం జిల్లా సమన్వయకర్తలు శంకర్, శక్తిమూర్తి, యూత్ కో–ఆర్డినేటర్ భారతి, ఆధ్యాత్మిక సమన్వయకర్త కామరాజు తదితరులు పాల్గొన్నారు.

కదం తొక్కిన ఉక్కు కాంట్రాక్టు కార్మికులు

- గాజువాక నుంచి కూర్మన్నపాలెం వరకు ఉపాధి రక్షణ పాదయాత్ర
- తొలగించిన కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్



పాదయాత్రలో ప్రసంగిస్తున్న దేవన్‌రెడ్డి

గాజువాక : స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుల తొలగింపును నిరసిస్తూ ఆదివారం భారీ పాదయాత్ర నిర్వహించారు. ఉపాధి రక్షణ యాత్ర పేరుతో విశాఖ ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పాదయాత్రలో కాంట్రాక్టు కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. కొత్తగాజువాక జంక్షన్‌లో ప్రారంభమైన ఈ పాదయాత్ర గాజువాక మెయిన్‌రోడ్, పాతగాజువాక, శ్రీనగర్ మీదుగా కూర్మన్నపాలెంలోని ఉక్కు కార్మికుల దీక్షా శిబిరం వరకు కొనసాగింది. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వైఎస్సార్‌సీపీ వ్యతిరేకమని స్పష్టం చేశారు. కాంట్రాక్టు కార్మికులను తొలగించడం దారుణమని, వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి పార్టీలను నమ్మి పెద్ద ఎత్తున మెజారిటీ ఇచ్చిన కార్మికులకు కూటమి ప్రజాప్రతినిధులు మద్దతు నిలవకపోవడం సరికాదన్నారు. కష్టంలో ఉన్న కాంట్రాక్టు కార్మికులకు అండగా నిలవాలని సూచించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మడానికి, కార్మికులను తొలగించడానికి మాత్రమే కేంద్ర ప్రభుత్వం ప్యాకేజీ ప్రకటించిందన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో పూర్తిస్థాయి ఉత్పత్తి సాధించడానికి ఆ ప్యాకేజీ వల్ల ఎలాంటి ఉపయోగంలేదన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుతామని, నిర్వాసితులకు ఉపాధి ఇస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన కూటమి నాయకులు ఎన్నికల్లో గెలిచిన తరువాత మొహం చాటేస్తున్నారన్నారు. ఉక్కు పరిరక్షణ కమిటీ కన్వీనర్ జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ ప్లాంట్ కోసం కార్మికులు 1500 రోజుల నుంచి ఉద్యమం చేస్తే కేంద్ర ప్రభుత్వం రూ.11,400 కోట్లు ప్యాకేజీ ఇచ్చిందన్నారు. ఇప్పుడు ఐదు వేల మంది కాంట్రాక్టు కార్మికులను రోడ్డుపైకి నెట్టేయడం కోసం ప్రయత్నిస్తోందన్నారు. అందులోభాగంగా ఇప్పటికే వెయ్యి మందిని బయటకు పంపేసిందన్నారు. సెయిల్‌లో కలపడానికి గాని, సొంత గనులు కేటాయించడానికి గాని కేంద్ర ప్రభుత్వానికి ఒక్క రూపాయి కూడా ఖర్చు కాదని, అయినప్పటికీ ప్రభుత్వం ఆ పని చేయకుండా ఉద్యోగులను తొలగిస్తోందన్నారు. కార్మికుల తొలగింపును ఆపకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, విశాఖ స్టీల్‌ప్లాంట్ అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ట్రాలీ లారీ బీభత్సం

- మూడు ద్విచక్ర వాహనాలకు ఢీ
- ఐదుగురికి తీవ్ర గాయాలు
- ఆస్పత్రికి తరలింపు



లారీ ఢీకొట్టడంతో దుకాణం గోడలు బీటలు వారిన దృశ్యం



మాడుగుల ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



మాడుగుల ప్రభుత్వాస్పత్రిలో తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న పల్లవి

మాడుగుల : మాడుగుల మండలం గాదిరాయి గ్రామంలో ట్రాలీ లారీ ఆదివారం సాయంకాలం మూడు ద్విచక్రవాహనాలను ఢీకొట్టడంతో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, బాధితులు కథనం ప్రకారం చోడవరం నుంచి కింతలి వైపు వస్తున్న ట్రాలీ లారీ కింతలి వైపు నుంచి ఘాట్‌రోడ్ వైపు వస్తున్న మూడు ద్విచక్రవాహనాలను గాదిరాయి వద్ద ఢీకొట్టింది. దీంతో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. విశాఖకు చెందిన ఎపి31 టిహెచ్ 2469 అనే నెంబరుగల ట్రాలీ లారీని పెందుర్తికి చెందిన లారీ డ్రైవర్ పాకలపాటి పవన్ కుమార్ మద్యం మత్తులో అజాగ్రతగా నడుపుతూ గాదిరాయి వద్ద వాహనాలను ఢీకొట్టాడు. స్థానికుల సహాయంతో క్షతగాత్రులను వెంటనే ఆస్పత్రికి తరలించారు. చోడవరం మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఇల్లపు పల్లవికి తీవ్ర గాయాలు తగలడంలో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. చీడికాడ మండలం చెట్టుబిల్లి గ్రామానికి చెందిన కాకర కొండబాబు, (55) కాకర కొండమ్మ(50)తో పాటు మాడుగుల మండలం గొటివాడ అగ్రహారానికి చెందిన మాదాసి ఎర్రునాయుడు, పల్ల అప్పారావుకు తీవ్రగాయాలు తగిలాయి. వారిని అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రికి తరలించారు. మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడం వల్ల బైక్‌లతో పాటు దగ్గరలో ఉన్న వ్యాపారదుకాణాన్ని లారీ ఢీకొట్టడంతో దుకాణం గోడలు దెబ్బతిన్నాయి. ఆ సమయంలో దుకాణంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కాగా బైక్‌లు నుజ్జునుజ్జు అయ్యి ఐదుగురు గాయపడ్డారు. స్థానిక 30 పడకల ఆసుపత్రికి వారిని తరలించగా అక్కడ వైద్యులు ప్రాథమిక వైద్యం అందించి తీవ్రంగా గాయపడిన పల్లవిని మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. మరో నలుగురిని అనకాపల్లి ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్.ఐ నారాయణరావు సంఘటన స్థలానికి చేరుకుని, ప్రమాదానికి కారణమైన డ్రైవర్ పవన్ కుమార్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ఆధునికీకరణ హామీని నిలబెట్టుకోవాలి

అనకాపల్లి: జిల్లాలో నడుస్తున్న ఏకైక గోవాడ సుగర్ ఫ్యాక్టరీని మూసివేసి, డిస్టలరీ బోటలింగ్ పరిశ్రమగా మారుస్తామని ఇటీవల జరిగిన విలేకరుల సమావేశంలో చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.రాజు ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ఎన్నికల సమయంలో గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆధునికీకరిస్తామని చోడవరం ఎమ్మెల్యే రాజు, ఎంపీ సి.ఎం.రమేష్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు, కార్మికులకు అండగా ఉంటామని, అవసరమైతే సొంత డబ్బులైనా పెట్టి ఫ్యాక్టరీని నడిపిస్తామని వాగ్దానం చేశారని గుర్తు చేశారు. రైతులకు రూ.32.30 కోట్లు, కార్మికులకు రూ.7 కోట్లు ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. చెరకు పంటకు బదులుగా మొక్కజొన్న పంట ద్వారా రైతులకు లక్షల ఆదాయం వస్తుందంటూ ఎమ్మెల్యే ఉచిత సలహాలు ఇవ్వడం మానుకోవాలని ఆయన హితవు పలికారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో వివిధ సెజ్‌ల పేరుతో వేలాది ఎకరాల భూమిని సేకరించిందని, ఆ భూముల్లో కొత్తగా ఈ డిస్టలరీ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే ఉపాధి దొరుకుతుంది తప్ప, ఉన్న ఫ్యాక్టరీని మూసివేసి, అందులోనే డిస్టలరీ ఏర్పాటు చేస్తే ఎవరికీ ఉపయోగం ఉండదన్నారు. ఎమ్మెల్యే మాటలను బట్టి చూస్తే కావాలనే ఈ రెండు నెలల కాలంలో 30 సార్లు పైగా ఫ్యాక్టరీ ఆగిపోవడా, రైతుల చెరకు ఎండిపోవడం, ఫ్యాక్టరీ నష్టం రావడం వంటి చర్యలకు పూనుకున్నట్టు రైతులు భావిస్తున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వంపై స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు ఒత్తిడి తీసుకొచ్చి ఫ్యాక్టరీని ఆధునికీకరించి నడిపించాలని, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనకు శ్రీకారం చుడతామని ఆయన హెచ్చరించారు.

రూ.2.20 లక్షలు కాజేసింది మైనర్ కుర్రాడు

- నిఘా పెట్టి అదుపులోకి తీసుకున్న పోలీసులు
- చోరీ సొత్తు స్వాధీనం



వివరిస్తున్న ఎస్ఐ రమేష్

కోటవురట్ల : రామచంద్రపురం శివారు సన్యాసిరాజుపాలెంలో ఓ ఇంట్లో జరిగిన చోరీపై సాక్షిలో 'సన్యాసిరాజుపాలెంలో చోరీ' శీర్షికన కథనం వెలువడింది. బాధితుల వివరణతో రూ.2.50,000 నగదు, అరతులం బంగారం చోరీకి గురైనట్టు కథనం ఇవ్వగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ కేసులో ఎస్ఐ రమేష్ చేసిన దర్యాప్తులో పురోగతి సాధించి చోరీ సొత్తు, బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాలు ఇవి. సన్యాసిరాజుపాలేనికి చెందిన సింగంపల్లి వరలక్ష్మి ఇంట్లో ఈ నెల 14వ తేదీన దొంగతనం జరిగి రూ.2.20 లక్షల నగదు, అర తులం బంగారం అపహరణకు గురైంది. పోలీసులు మొదట రూ.20 వేలు నగదు, అర తులం బంగారం చోరీ జరిగినట్టుగా నమోదు చేశారు. పూర్తి విచారణలో రూ.2.20 లక్షలు నగదు, అరతులం బంగారంగా గుర్తించి పూర్తి స్థాయిలో దర్యాప్తు చేశారు. ఈ దర్యాప్తులో అదే గ్రామానికి చెందిన మైనర్ యువకుడు చోరీకి పాల్పడినట్టు గుర్తించారు. అతనిపై నిఘా పెట్టి ఆదివారం జల్లూరు జంక్షన్‌లో అదుపులోకి తీసుకున్నారు. ఆ యువకుడి వద్ద నుంచి రూ.2,20,000 నగదు, అర తులం బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. యువకుడిని జువైనల్ హోమ్‌కు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

40 ఎకరాల్లో జీడి తోటలు దగ్ధం

20మంది రైతులకు రూ.లక్షలాదిగా నష్టం



ఎల్‌బీపీ అగ్రహారం రెవెన్యూ పరిధిలో కాలిపోయిన జీడితోటలను పరిశీలిస్తున్న వెంకన్న తదితరులు

బుచ్చెయ్యపేట : మండలంలో ఎల్‌బీపీ అగ్రహారం రెవెన్యూ పరిధిలో 20 కుటుంబాలకు చెందిన 40 ఎకరాల్లో జీడితోటలు శనివారం అర్ధరాత్రి దగ్ధమయ్యాయి. ప్రమాదవశాత్తూ జరిగిన అగ్ని ప్రమాదంలో పంట చేతికి వస్తుందని సమయంలో అగ్ని ప్రమాదంలో జీడితోటలు దగ్ధమవడం పట్ల రైతులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. కాలిపోయిన జీడితోటలను ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు డి. వెంకన్న, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.వి.నాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పి.సాంబశివరావు ఆదివారం పరిశీలించారు. నష్టపోయిన రైతులును ప్రభుత్వం ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. జీడితోటలు పంట సస్యరక్షణ చర్యలకు లక్షలాది రుపాయలు వ్యయం చేశారని, పంట చేతికొచ్చే సమయంలో ఈ సంఘటన జరగడం దురదృష్టకరమైన విషయమని వారు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా అధికారులు కాలిపోయిన తోటలు పరిశీలించి, జీడి రైతులను ఆదుకోవాలని వారు కోరారు. వీరి వెంట కురస శంకరావు, అనిమిరెడ్డి దొంగబాబు, బోడి కొండబాబు, గోరపల్లి వెంకయ్యమ్మ, సత్తిబాబు పాల్గొన్నారు.

విశాఖ తీరంలో మరో ఆకర్షణ

తుది దశకు హెలికాప్టర్ మ్యూజియం పనులు



యుద్ధ హెలికాప్టర్ మ్యూజియం



అలరించనున్న హెలికాప్టర్

ఏయూక్యాంపస్: సాగరతీరంలో మరో పర్యాటక ప్రాజెక్ట్ సిద్ధమవుతోంది. బీచ్ రోడ్డులో ఇప్పటికే ఉన్న టీయూ–142 యుద్ధ విమాన మ్యూజియం పక్కనే యూహెచ్–3 హెచ్ హెలికాప్టర్ మ్యూజియం తుది మెరుగులు దిద్దుకుంటోంది. వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో దాదాపు రూ. 2.2 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటోంది. భారత నావికాదళంలో 17 ఏళ్లపాటు అవిరళంగా సేవలందించిన ఈ హెలికాప్టర్‌ను కొది నెలల కిందట విశ్రాంతినిచ్చారు. విపత్తుల సమయంలోనూ, తీర ప్రాంత భద్రతలోనూ ఇది ఎంతో కీలక పాత్ర పోషించింది. దీని ప్రాముఖ్యాన్ని గుర్తించి వీఎంఆర్డీఏ .. భారత నావికాదళ సత్తాను చాటి చెప్పేలా, పర్యాటకులకు సరికొత్త అనుభూతిని పంచేలా ఈ మ్యూజియాన్ని తీర్చిదిద్దుతోంది. ప్రస్తుతం ఈ ప్రాంగణంలో సుందరీకరణ పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. రానున్న రెండు వారాల్లో దీనిని ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. హెలికాప్టర్ చుట్టూ పచ్చని లాన్‌లు, ప్రత్యేకమైన మొక్కలు, ఆకర్షణీయమైన నీటి ఫౌంటెన్‌లను ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో విద్యుత్ కాంతుల్లో మరింత అందంగా కనిపించేలా దీని చుట్టూ అద్దాల నిర్మాణం చేపట్టారు. త్వరలోనే సందర్శన వేళలు, టికెట్ ధరలకు సంబంధించిన వివరాలను వీఎంఆర్డీఏ ప్రకటించే అవకాశం ఉంది. నేటి యువతరం సెల్ఫీలు, ఫొటోల పట్ల చూపిస్తున్న ఆసక్తిని దృష్టిలో ఉంచుకుని మ్యూజియం లోపలి భాగాన్ని ప్రత్యేకంగా తీర్చిదిద్దినట్లు తెలుస్తోంది.

మౌలిక వసతుల కోసం గిరిజనుల నిరసన



అధికారులు తీరును నిరసిస్తూ ఆందోళన చేస్తున్న గిరిజనులు

రావికమతం: కనీస మౌలిక వసతులు కల్పించాలంటూ మండలంలో చీమలపాడు పంచాయతీ సామాలమ్మ కొండపై జీలుగులోవ గ్రామంలో పీవీటీజీ తెగకు చెందిన 8 గిరిజన కుటుంబాలు ఆదివారం ఆందోళనకు దిగాయి. కనీస సౌకర్యాలు లేవని గతంలో వివిధ పత్రికల్లో ప్రచురితమైన కథనాలకు జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పందిస్తూ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో అధికారులు గిరిజన గ్రామాన్ని సందర్శించి కొండ కిందకు వస్తే అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. దీనికి గిరిజనులు అంగీకరించారు. వీరికి చీమలపాడు రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 169లో 30 సెంట్ల స్థలాన్ని కేటాయించారు. అయితే ఇప్పటికీ పట్టాలు ఇవ్వలేదు. కనీస సౌకర్యాలు కూడా కల్పించలేదు. దీంతో చాలా ఇబ్బందులకు గురై గతంలో సీదరి వెంకట్రావు(50), కొర్రా బాబూరావు(45)మృతి చెందారని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం గిరిజనులు రోడ్డెక్కారు. మంగళవారం రావికమతం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు గోవిందరావు, కొర్రా బాలరాజు, సీదరి బాలరాజు తెలిపారు.

కుక్కల దాడిలో ఇద్దరు చిన్నారులకు గాయాలు



కె.జె.పురంలో కుక్కల దాడిలో గాయపడిన చిన్నారులు జ్ఞానేశ్వర్, ప్రణీత

మాడుగుల రూరల్: కె.జె.పురం గ్రామంలో కుక్కలు స్వైర విహారం చేశాయి. స్థానిక హౌసింగ్ కాలనీలో ఆదివారం ఉదయం యల్లపు రాము కుమారుడు జ్ఞానేశ్వర్, కుమార్తె ప్రణీత ఇంటి నుంచి షాపునకు వెళ్తుండగా కుక్కలు దాడి చేశాయి. గాయాలు పాలైన చిన్నారులను కె.జె.పురం పీహెచ్‌సీకి తరలించి, చికిత్స అందించారు. గ్రామంలో కుక్కల ఏరివేత చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వేంపాడులో నూకాలమ్మకు జలాభిషేకం



కలశాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు



ఊరేగింపులో మహిళల కోలాటం సందడి

నక్కపల్లి: మండలంలో ప్రసిద్ధి గాంచిన వేంపాడు నూకాలమ్మకు ఆదివారం గ్రామస్తులు జలాభిషేకం నిర్వహించారు. వందలాది మంది మహిళలు నెత్తిన కలశాలు పెట్టుకుని గ్రామంలో పలు వీధుల్లో భారీ ఊరేగింపు నిర్వహించారు. కోలాటాలు, భజనలతో సాగిన ఈ ఊరేగింపు అనంతరం నూకాలమ్మ ఆలయానికి వెళ్లి అమ్మవారి విగ్రహానికి జలాభిషేకం చేశారు. ఈ నెల 28న కొత్త అమావాస్య పండగను పురస్కరించుకుని ఆదివారం అమ్మవారికి జలాభిషేకం నిర్వహించినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

రోడ్డు విస్తరణకు నిర్వాసితుల ఆమోదం తప్పనిసరి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

అచ్యుతాపురం రూరల్ : రోడ్డు విస్తరణకు నిర్వాసితుల ఆమోదం తప్పనిసరని, లేని పక్షంలో ఎటువంటి శంకుస్థాపనలు చేయొద్దని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. భూములు, ఇళ్లు, షాపులు కోల్పోతున్న నిర్వాసితులతో చర్చించకుండా టీడీఆర్ బాండ్లు ఇప్పిస్తామని స్థానిక ఎమ్మెల్యే ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆదివారం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ గ్రామసభలు నిర్వహించకుండా ఏకపక్షంగా టీడీఆర్ బాండ్లు ప్రకటించడం అన్యాయమన్నారు. నగదు రూపంలో చెల్లించి భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు పునరావాసం కల్పించి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. 2013 భూసేకరణ చట్టం అమలు చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. రోడ్డు విస్తరణలో నష్టపోతున్న చిరు వ్యాపారులకు పరిహారం చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ రొంగలి రాము, పార్టీ నాయకులు కాండ్రేగుల రాము, సదాశివరావు, కర్రి అప్పారావు, బుద్ధ రంగారావు, చేపల తాతయ్య, కూండ్రపు సోమునాయుడు, రామ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉల్లాస్ పరీక్ష కేంద్రం పరిశీలన



ఉల్లాస్ పరీక్ష నిర్వహణ పరిశీలిస్తున్న చిన్నికృష్ణ

యలమంచిలి రూరల్: వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే ఉల్లాస్(అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని పలు చోట్ల వయోజనులకు నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వయోజన విద్యా సంచాలకుడు డి.చిన్నికృష్ణ మండలంలోని లైనుకొత్తూరు కాలనీలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. పరీక్ష నిర్వహణ తీరును ఆయన తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించిన ఈ పరీక్షలో చదవడం, రాయడం, సంఖ్యా పరిజ్ఞానంపై ప్రశ్నలకు సమాధానాలు రాయించారు. యలమంచిలి ఏపీఎం జి.ఎస్తేరు రాణి ఆయన వెంట ఉన్నారు.

ఆఖరి నిమిషంలో.. హంగామా

- బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరులో గందరగోళం
- ఆర్థిక సంవత్సరం ముగింపు సమయంలో హడావుడిగా నోటిఫికేషన్
- 2024–25 ఏడాది సబ్సిడీ రుణాలంటూ దరఖాస్తుల ఆహ్వానం
- ప్రభుత్వ తీరు, రుణాల మంజూరుపై సర్వత్రా అనుమానాలు



రుణాల మంజూరుకు ఆన్‌లైన్ దరఖాస్తు వెబ్‌సైట్

ఎంవీపీకాలనీ: ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న సమయంలో జిల్లా బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలు మంజూరుకు దరఖాస్తులు ఆహ్వానించడం దుమారం రేపింది. 2024–2025 ఆర్థిక సంవత్సరానికి గానూ స్వయం ఉపాధి కోసం బీసీ, ఈబీసీ, కాపు, బ్రాహ్మణ, కమ్మ, ఆర్యవైశ్య ఇలా ఆ కార్పొరేషన్ పరిధిలోని అనేక అనుబంధ కార్పొరేషన్ల ద్వారా జిల్లాలోని వెనుకబడిన తరగతుల వారికి రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపింది. ఈ మేరకు ఈ నెల 11న నోటిఫికేషన్ విడుదల చేసి, తొలుత దరఖాస్తులకు 22వ తేదీని చివరి తేదీగా పేర్కొంది. అయితే, తాజాగా మరో మూడు రోజులు దరఖాస్తు గడువును పొడిగించింది. గత ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమ పథకాలను నిలిపివేసిన కూటమి ప్రభుత్వం, ఏడాది మొత్తం వదిలేసి ఆర్థిక సంవత్సరం ముగింపు సమయంలో రుణాల నోటిఫికేషన్ విడుదల చేయడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పైగా, గడువును పొడిగించడం ఈ అనుమానాలకు మరింత బలం చేకూరుస్తోంది. ఈ నేపథ్యంలో అసలు ఈ రుణాలు లబ్ధిదారులకు అందుతాయా లేదా కేవలం ప్రచారం కోసమే కూటమి ప్రభుత్వం ఈ నోటిఫికేషన్‌తో హడావిడి చేస్తుందా అనే ప్రశ్నలు లబ్ధిదారుల నుంచి సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

20,914 మంది దరఖాస్తులు

స్వయం ఉపాధి, జనరిక్ ఫార్మసీలు, వివిధ కులవృత్తులకు ఆర్థిక సహాయం అందించే లక్ష్యంతో 2024–2025 ఆర్థిక సంవత్సరానికి గానూ బీసీ కార్పొరేషన్ ఈ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. నోటిఫికేషన్ విడుదలైన 11 రోజుల్లోనే జిల్లా వ్యాప్తంగా 20,914 ఆన్‌లైన్ దరఖాస్తులు(శనివారం సాయంత్రం 4 గంటల వరకు) వచ్చినట్లు బీసీ కార్పొరేషన్ కార్యాలయం తెలిపింది. ప్రభుత్వం కేవలం 6,032 యూనిట్ల మంజూరు లక్ష్యాన్ని నిర్దేశించగా, వచ్చిన దరఖాస్తుల సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. మరోవైపు ఆర్థిక సంవత్సరం ముగియడానికి వారం రోజులే ఉండటంతో, ఈ భారీ సంఖ్యలో వచ్చిన దరఖాస్తుల పరిశీలన, అర్హుల ఎంపిక ప్రక్రియ ఎప్పుడు పూర్తవుతుందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి కార్పొరేషన్ ద్వారా మంజూరు చేసే రుణాల ప్రక్రియ ప్రతి సంవత్సరం మార్చి నాటికి పూర్తవుతుంది. ఆ తర్వాత కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో కొత్త నోటిఫికేషన్లు విడుదల చేస్తారు. అయితే ఈసారి మాత్రం 2024–2025 సంవత్సరానికి సంబంధించిన రుణాల ప్రక్రియను మార్చి చివరిలో ప్రారంభించడం అనేక అనుమానాలకు తావిస్తోంది. దీనికి తోడు, కేవలం 11 రోజుల వ్యవధిలో 20 వేలకు పైగా దరఖాస్తులు రావడం వెనుక కూటమి నాయకుల హస్తం ఉందనే అనుమానాలు కూడా వినిపిస్తున్నాయి. ఈ హడావుడి నోటిఫికేషన్ ద్వారా తమకు కావాల్సిన వారికే రుణాలు మంజూరు చేయించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో ఈ రుణాల మంజూరు ప్రక్రియలో పారదర్శకత లోపించే అవకాశం ఉందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

షెడ్యూల్ ప్రకారం పూర్తిచేస్తాం



ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం రుణాల మంజూరు ప్రక్రియను పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 27 నాటికి రుణాలు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. మే 1 నాటికి మంజూరు ప్రక్రియ మొత్తం పూర్తి చేయాలి. మే 11 నాటికి జియోట్యాగింగ్, మే 21 నాటికి వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేయాలనే ఆదేశాలతో ముందుకు సాగుతున్నాం. ఆర్థిక సంవత్సరం ముగింపు సమయంలో నోటిఫికేషన్ విడుదలైన విషయం వాస్తవమే. అందుకే రెండు నెలల్లో మొత్తం ప్రక్రియ పూర్తి చేసేలా ప్రభుత్వం షెడ్యూల్ రూపొందించింది.

– శ్రీదేవి, ఈడీ బీసీ కార్పొరేషన్

క్లుప్తంగా

28న జాబ్‌మేళా

అనకాపల్లి టౌన్: పట్టణంలోని సాయికుల్వంత్ డిగ్రీ కాలేజీలో ఈ నెల 28న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం కామరాజు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ఐసాన్ ఎక్స్‌పీరియన్స్ కంపెనీలో టెలిసేల్స్ రిప్రజెంటేటివ్, నిట్ ఐసీఐసీఐ బ్యాంక్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో అసిస్టెంట్ మేనేజర్, డెక్కన్ కంపెనీలో ట్రైనీ (ప్రొడక్షన్, మెయిన్‌టెనెన్స్), జూనియర్ ఇంజనీర్, సీనియర్ ఇంజనీర్, జూనియర్ కెమిస్ట్, సీనియర్ కెమిస్ట్, హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్‌లో బిజినెస్ ఎగ్జిక్యూటివ్ రిలేషన్‌షిప్ మేనేజర్, ఇసుజు మోటార్స్, ఇండో ఎంఐఎం, పానాసోనిక్, హోండాయ్ మోబీస్ కంపెనీలలో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. పై ఉద్యోగాలకు ఎస్సెస్సీ, ఇంటర్, ఐటీఐ డిప్లొమా, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాలలోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన వారికి రూ.12 వేల నుంచి రూ.25 వేల వరకు జీతం ఆయా కంపెనీల బట్టీ ఉంటుందన్నారు. అభ్యర్థులు కళాశాల వద్దకు ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ జెరాక్స్ పత్రాలతో హాజరు కావాలని కోరారు.

ప్రవేశ పరీక్ష వాయిదా

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో ఏపీ సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలలో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశ పరీక్ష వారం రోజుల పాటు వాయిదా పడినట్లు ప్రిన్సిపాల్ జి. గ్రేస్ తెలిపారు. 2025–26 సంవత్సరానికి గాను ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి వేర్వేరుగా ఏప్రిల్ 6వ తేదీన పరీక్ష నిర్వహించాల్సి ఉందన్నారు. అనివార్య కారణాల వల్ల ఈ పరీక్షను అదే నెల 13వ తేదీకి వాయిదా వేశారన్నారు. ఈ విషయాన్ని విద్యార్థులు గమనించాలని కోరారు.

మండల స్థాయి ప్రజా వేదిక నేడు

కశింకోట: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై సోమవారం ఉదయం మండల స్థాయి ప్రజా వేదిక కార్యక్రమం జరగనుందని ఎంపీడీవో వి.వి. రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధి పథకం పనులతోపాటు గృహ నిర్మాణ శాఖ ద్వారా జరిగిన పనులు, అటవీ శాఖ ద్వారా చేపట్టిన పనుల, ఇతర పనులపై సామాజిక తనిఖీ నిర్వహిస్తారన్నారు. ఇప్పటికే గ్రామ స్థాయిలో సామాజిక తనిఖీలు నిర్వహించి గ్రామ సభల్లో నివేదికలు తెలియజేసినట్లు తెలిపారు. చివరిగా మండల స్థాయిలో సామాజిక తనిఖీ కోసం ప్రజా వేదిక ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ఆశీలు వసూలు వేలం నేడు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని హోల్‌సేల్ కాయగూరల మార్కెట్, చేపలబజార్లు, రోడ్లపై తోపుడు బండ్లు, వివిధ రకాల కాయగూరలు, పండ్లు అమ్ముకొనే వారి దగ్గర నుంచి ఆశీలు వసూలు చేసుకునే వేలం పాట సోమవారం ఉదయం 11 గంటలకు జీవీఎంసీ జోన్ కార్యాలయం ఆవరణలో నిర్వహిస్తున్నట్లు కార్యాలయ ప్రతినిధి ఫణీంద్ర తెలిపారు. ఆసక్తి ఉన్న పాటదారులందరూ హాజరు కావాలన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ అసిరితాత

పెందుర్తి: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే జైలు పాలు కావాల్సి వస్తుందని సబ్ ఇన్‌స్పెక్టర్ స్వామినాయుడు రౌడీ షీటర్లను హెచ్చరించారు. ప్రవర్తన మార్చుకుంటే రౌడీ షీట్‌లు తొలగించేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేయనున్నట్లు పేర్కొన్నారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు సీఐ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ చెడు ప్రవర్తన వలన, కుటుంబ సభ్యులు సమాజంలో ఎదుర్కొనే చిన్నచూపును, వివక్షను గుర్తెరిగి మసలుకోవాలని హితవు పలికారు. రౌడీషీటర్ల ప్రవర్తన పిల్లల భవిష్యత్‌పై కూడా ప్రభావం చూపుతుందన్నారు. సంఘంలో గౌరవప్రదమైన జీవితానికి పలు సూచనలు చేశారు.

అనకాపల్లి సినిమాలు

రాజా :	రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్
సత్యనారాయణ స్క్రీన్-1:	టుక్‌టుక్
సత్యనారాయణ స్క్రీన్-2:	యుగానికి ఒక్కడు
పర్తిసాయి	: కోర్ట్
షిర్డీసాయి	: పెళ్లికాని ప్రసాద్
వెంకటేశ్వర(ఉదయం)	: షణ్ముక
వెంకటేశ్వర(మ్యాట్నీ, 1,2 షోలు):	న్యూ పోలీస్ స్టోరీ
శ్రీసత్య	: సలార్
రామచంద్ర	: ఛావా

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 39 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-05 యూనిట్లు, బీ పాజిటివ్-13 యూనిట్లు, ఓ పాజిటివ్-15 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

రైల్వే స్టేషన్లో సమస్యల కూత



కశింకోట రైల్వే స్టేషన్‌లో కాకినాడ ఎక్స్‌ప్రెస్ దిగి వస్తున్న ప్రయాణికులు



కశింకోట రైల్వే స్టేషన్

- విరిగిన కుర్చీలు, బల్లలు
- నిరుపయోగంగా మరుగుదొడ్లు
- పిల్లలూ పెద్దల టికెట్‌పై ప్రయాణించాల్సిందే..
- తుప్పలతో నిండిన ప్లాట్ ఫారం
- కశింకోట రైల్వే ప్రయాణికుల తీవ్ర ఇక్కట్లు

కశింకోట: ఒకప్పుడు ప్రయాణికులతో కళకళలాడిన కశింకోట రైల్వే స్టేషన్ సమస్యల నిలయంగా మారింది. వీటిని ఎవరు పరిష్కరిస్తారా? అని వారంతా వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. స్టేషన్‌లో సరైన సదుపాయాలు లేవు. స్టేషన్ ప్రాంతం తుప్పలతో నిండి భయానకంగా ఉంది. కనీసం మరుగుదొడ్ల సదుపాయం లేదు. రానూ పోనూ కేవలం రెండే రైళ్లు ఆగుతున్నాయి. వీటిలో ఒక రైలు నిర్ణీత సమయం ఉన్నా, ఎప్పుడు వస్తుందో ఠికాణా లేదు. పిల్లలూ పెద్దల టిక్కెట్ చార్జీపైనే ప్రయాణించాల్సి వస్తోంది. అయినప్పటికి అటు అధికారులుగాని, ప్రజా ప్రతినిధులు గాని పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శిస్తున్నారు.

ఆరు దశాబ్దాల క్రితం ఏర్పడిన కశింకోట రైల్వే స్టేషన్‌ను సుమారు 30 వేల మంది జనాభా కలిగిన కశింకోట, సంపతిపురం, వెదురుపర్తి, పిసినికాడ, బయ్యవరం తదితర గ్రామాల ప్రజలకు ఉపయోగపడుతోంది. కరోనా ముందు వరకు ఇక్కడ రానూ, పోనూ నాలుగు రైళ్లు ఆగేవి. రోజుకు సుమారు ఐదారు వందల మంది ప్రయాణికులు, విద్యార్థులు, చిరు వ్యాపారులు, ఉద్యోగులు తదితరులు నిత్యం రాకపోకలు సాగించే వారు. విశాఖ, విజయనగరం, రాయగడ, విజయవాడ, సామర్లకోట, అన్నవరం, తుని, పిఠాపురం, ఏలూరు తదితర ప్రాంతాలకు ఇక్కడి నుంచి ప్రయాణించే వారు. ఇప్పుడు కేవలం రెండు రైళ్లు మాత్రమే ఆగుతున్నాయి. వాటిని ఎప్పుడు రద్దు చేస్తారో, ఎప్పుడు నడుపుతారో తెలియని అయోమయ పరిస్థితి. వీటిలో ఈ నెల 17 వరకు కాకినాడ ఎక్స్‌ప్రెస్ మాత్రమే ఆగేది. తాజాగా రాజమండ్రి పాసింజర్‌ను పునరుద్ధరించారు. అది రాజమండ్రి నుంచి విశాఖ వెళ్లే సమయంలో మధ్యాహ్నం 12.22 గంటలకు, విశాఖ నుంచి రాజమండ్రి వైపు వెళ్లేటప్పుడు రాత్రి 7.10 గంటలకు ఇక్కడి రైల్వే స్టేషన్‌కు రావలసి ఉంది. ఇవి నిర్ణీత సమయానికి 2 నుంచి 3 గంటల వరకు ఆలస్యంగా వస్తున్నాయి. దీంతో గత్యంతరం లేక చార్జీల భారం తగ్గుతుందని అప్పటి వరకు నిరీక్షించాల్సి వస్తోందని, గమ్యాలకు సకాలంలో చేరలేకపోతున్నామని నిట్టూరుస్తున్నారు. మరికొందరు ప్రయాణికులు బస్సుల్లో ఎక్కువ చార్జీ అయినా చెల్లించి చేరుకోవలసిన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

విష పురుగుల బెడద..

స్టేషన్ ప్రాంగణం తుప్పలతో నిండి ఉంది. దీని వల్ల విష పురుగులకు నిలయంగా మారుతుందని ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. అయినప్పటికీ వాటిని తొలగించడం లేదు. మరుగుదొడ్లు తుప్పలతో నిండి చాలా కాలంగా నిరుపయోగంగా ఉన్నాయి. దీనివల్ల అత్యవసర సమయంలో ఇబ్బంది పడాల్సి వస్తోంది. కొన్ని బల్లలు విరిగిపోయాయి. ప్లాట్ ఫారం ఎత్తుగా లేదు. రైళ్లు ఎక్కి, దిగడానికి ఇబ్బంది పడాల్సి వస్తోందని వృద్ధులు, పిల్లలు వాపోతున్నారు. ఒక్కొక్కసారి పడిపోయి గాయాల పాలవుతున్నారు. రైల్వే స్టేషన్‌లో సమస్యలు పరిష్కరించి అదనంగా రైళ్లు నిలుపుదల చేయడానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



తుప్పల మధ్య బల్లలు



తుప్పల మధ్య రైల్వే స్టేషన్



దెబ్బతిన్న ప్లాట్ ఫారం అంచు భాగం

పాసింజర్ రైళ్లకు హాల్టు లేక ఇక్కట్లు..

గతంలో ఇక్కడ ఆగే రాయగడ- గుంటూరు, విశాఖ-విజయవాడ పాసింజర్ రైళ్లకు హాల్టు ఇవ్వాలని కోరుతున్నారు. ఇవి ఆగక అనకాపల్లి వెళ్లి రైళ్లు ఎక్కాల్సి వస్తోందని వాపోతున్నారు. అనుకూలంగా ఉన్న ఈ రైళ్లు ఆగకపోవడం వల్ల ప్రయాణికుల తాకిడి కూడా తగ్గిపోయే పరిస్థితి ఏర్పడింది. కరోనాకు ముందు పాసింజర్ రైళ్లగా నడిచినప్పటికీ ఆనక ఎక్స్‌ప్రెస్‌గా చార్జీలు వసూలు చేస్తూ వచ్చారు. అయితే రాజమండ్రి పాసింజర్‌కు గతంలో వలె తాజాగా చార్జీలు వసూలు చేస్తున్నారు. కాకినాడ రైలుకు మాత్రం ఎక్స్‌ప్రెస్‌గానే కొనసాగిస్తూ ఎక్స్‌ప్రెస్ చార్జీలనే వసూలు చేస్తున్నారు.

పిల్లలైనా పెద్దల టికెట్ కొనుగోలు చేయాల్సిందే..

కశింకోట రైల్వే స్టేషన్ రెండు దశాబ్దాల క్రితం వరకు క్లర్క్ ఇన్‌చార్జి ఆధ్వర్యంలో నడిచేది. ఆ తర్వాత స్టేషన్‌ను హాల్ట్ స్టేషన్‌గా మార్చు చేసి ప్రైవేటు ఏజెంటు ద్వారా ప్రయాణికుల టిక్కెట్లు అమ్మకం చేపట్టారు. దాంతో చేరవలసిన స్టేషన్లకు టిక్కెట్లు లభించక దూరం స్టేషన్ ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఎక్కువ చార్జీ చెల్లించి దూర ప్రాంత స్టేషన్లకు టిక్కెట్లు కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఇక్కడ పిల్లలకు సగం చార్జీతో టిక్కెట్లు ఇవ్వడం లేదు. పిల్లలైనా పెద్దల టిక్కెట్ కొనుగోలు చేసి ప్రయాణించాల్సిన పరిస్థితి ఎదుర్కొంటున్నారు.



తుప్పలతో నిండి ఉన్న రైల్వే ప్లాట్ ఫారం



మరుగుదొడ్లను వినియోగంలోకి తేవాలి

కశింకోట రైల్వే స్టేషన్‌లో సౌకర్యాలు మెరుగుపర్చాలి. దెబ్బతిన్న ప్రయాణికుల బల్లలను తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలి. నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లను వినియోగంలోకి తేవాలి. ప్లాట్ ఫారాలను ఎత్తు చేయాలి.

– మంత్రి అప్పారావు, రైల్వే కాలనీ, కశింకోట



టికెట్లు అందుబాటులో ఉంచాలి

కశింకోట రైల్వే స్టేషన్‌లో తుప్పలు పేరుకుపోయి ఉన్నాయి. దీంతో విష సర్పాలు, పురుగుల ప్రమాదం పొంచి ఉంది. తక్షణమే తుప్పలను తొలగించి స్టేషన్‌ను అభివృద్ధి చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి. పిల్లల టిక్కెట్లను, అన్ని రైల్వే స్టేషన్లకు ఇక్కడి నుంచి టిక్కెట్లు అందుబాటులో ఉంచాలి.

–డి. అప్పారావు, కశింకోట



ఆ రైళ్లను నిలుపుదల చేయాలి

కశింకోట రైల్వే స్టేషన్‌లో రెండు రైళ్లు మాత్రమే రానూ, పోనూ ఆగుతున్నాయి. ప్రయాణికులు, విద్యార్థులు రాకపోకలు సాగించడానికి వీలుగా ప్రధానంగా రాయగడ-గుంటూరు, విశాఖ-మచిలీపట్నంల మధ్య నడిచే రైళ్లను నిలుపుదల చేయాలి.

– రోమాల సురేష్, కశింకోట

నూకాంబిక జాతర ఉత్సవ కమిటీ ఎన్నిక



ఉత్సవ కమిటీతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఆలయ ఈవో రాంబాబు

అనకాపల్లి: నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర ఉత్సవ కమిటీ చైర్మన్‌గా పీలా నాగ శ్రీను (గొల్లబాబు) నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం స్థానిక గవరపాలెం అమ్మవారి ఆలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ కమిటీ సభ్యులుగా సూరే సతీష్, దాడి రవికుమార్, పొలిమేర ఆనంద్, మారిశెట్టి శంకరరావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వద్దాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి, ఎర్రవరపు లక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో వెంపల రాంబాబు మాట్లాడుతూ అమ్మవారి కొత్త అమావాస్య జాతరను ఉత్సవ కమిటీ సహకారంలో వైభవంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీష్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సిబ్బందిపై దాడి ఘటనలో నిందితులపై కేసు

- రెండు రోజుల తర్జనభర్జనల మధ్య చర్యలకు ముందడుగు
- డీఎస్పీ ఆదేశాలతో పలు సెక్షన్ల కింద కేసు నమోదు

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలోని ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగించేందుకు వెళ్లిన రెవెన్యూ సిబ్బందిపై దాడి ఘటనలో నలుగురిపై సబ్బవరం పోలీసులు ఎట్టకేలకు కేసు నమోదు చేశారు. సబ్బవరం రెవెన్యూ పరిధి సర్వే నెం.271లో ప్రభుత్వ భూమి గెడ్డవాగులో నిర్మించిన అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు శుక్రవారం వెళ్లిన రెవెన్యూ సిబ్బందిపై దాడి చేసిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సింహాచలం ఆదివారం తెలిపారు. వీఆర్వోలు వినోద్, నూకరత్నం, వీఆర్ఏ ముదపాక అప్పారావు, ఆర్ఐ వీరయ్య విధులను అడ్డుకోవడం, దుర్భాషలాడటం, రాళ్లతో దాడి చేయడం, కులం పేరిట దూషించడం వంటి చర్యలపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. దాడికి పాల్పడిన వారిలో గొంప ముత్యాలనాయుడు(రావలమ్మపాలెం), గొర్లివానిపాలేనికి చెందిన గొర్లి కుమారస్వామి, లగుడు సత్యనారాయణ, పెదనాయుడుపాలేనికి చెందిన గొర్లి శ్రీనివాసరావులను త్వరలోనే అరెస్టు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

చర్యలకు దళిత సంఘాల డిమాండ్

రెవెన్యూ సిబ్బందిపై భౌతిక దాడులకు దిగిన సంఘటనలు గతంలో ఎప్పుడూ జరగలేదని, రెవెన్యూ ఉద్యోగులకు రక్షణ లేకుండా పోతే సామాన్యుల పరిస్థితి ఏంటని దళిత సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. దాడికి పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల రెవెన్యూ అధికారుల సంఘం, వీఆర్వోల సంఘం, వీఆర్ఏల సంఘాలు డిమాండ్ చేశాయి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగు శిక్షలు విధించాలని కోరారు.

‘అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేయాలి’

అనకాపల్లి టౌన్: పట్టణానికి ఆనుకున్న ఆవకండంలో అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేయాలని ప్రజా రాజకీయ వేదిక కన్వీనర్ కనిశెట్టి సురేష్‌బాబు కోరారు. పట్టణంలోని ప్రజా రాజకీయ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆవకండంలో దిగువకుపోయే వరద నీటికి అడ్డుకట్ట వేసే విధంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. ఈ ప్రాంతంలో 11 కాలువలు జాడ లేకుండా గ్రావెల్‌తో కప్పేస్తున్నారన్నారు. ఈ పనులను జిల్లా అధికార యంత్రాంగం నిలుపుదల చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కర్రి అప్పారావు, కోరుబిల్లి శంకర్రావు, కొణతాల హరనాథ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన వివాహిత ఆచూకీ లభ్యం

పెందుర్తి: పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధి, వేపగుంట ప్రాంతానికి చెందిన ఓ మహిళ, ఆమె ఇద్దరు పిల్లల మిస్సింగ్ కేసును పోలీసులు ఛేదించారు. దాదాపు 25 రోజుల క్రితం మహిళ(32), ఇద్దరు పిల్లలు(10, 07) అదృశ్యమయ్యారు. దీనిపై కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించగా సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ స్వామినాయుడు బృందం కేసు దర్యాప్తు చేపట్టింది. ఆదివారం వారి ఆచూకీ కనుగొని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మరో కేసులో యువకుడి ఆచూకీ లభ్యం

నాయుడుతోట ప్రాంతానికి చెందిన ఓ యువకుడు రెండు నెలల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లి, తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించగా సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో హెచ్‌సీ నాగేశ్వరరావు దర్యాప్తు చేపట్టారు. నగరంలో తిరుగుతున్న యువకుడ్ని ఆదివారం ఉదయం గుర్తించిన పోలీసులు, అతడ్ని సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు.

గూడ్స్ డ్రైవర్ వరహాలుబాబుకు సత్కారం



రైల్వే గూడ్స్ డ్రైవర్ వరహాలుబాబు దంపతులను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ మాధవ్

అనకాపల్లి: విశాఖ రైల్వే లోకో పైలట్(డ్రైవర్) సుంకర వరహాలుబాబు దంపతులను ఆదివారం స్థానిక గవరపాలెం నూకాంబిక ఆలయం వద్ద మాజీ ఎమ్మెల్సీ పీవీ మాధవ్ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ డ్రైవర్ చాకచక్యంగా గూడ్స్ రైలును నడపడంతో పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. ఈ నెల 17న అనకాపల్లి విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద రైల్వే ట్రాక్ గడ్డర్‌ను లారీ ఢీకొనడంతో పక్కకు ఒరిగిపోయింది. ఆ సమయంలో చెన్నై నుంచి విశాఖకు వెళ్తున్న గూడ్స్ రైలును సడన్ బ్రేక్ ఆపడం జరిగిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దేవదాయ శాఖ స్థలానికి రక్షణ కరువు



శాఖవీధిలో స్థలానికి తాళం లేకుండా ఉన్న గేటు



సరిగ్గా కనిపించని దేవదాయ స్థలం అని తెలిపే బోర్డు

అనకాపల్లి టౌన్: మారుమూల ప్రాంతంలో ప్రభుత్వ స్థలాలు కనిపిస్తే చాలు ఆక్రమిస్తున్న రోజులివి. అలాంటిది పట్టణ నడిబొడ్డున శాఖవీధిలో దేవదాయ శాఖకు చెందిన స్థలానికి రక్షణ కరువైంది. ఎంతో విలువైన స్థలానికి రక్షణగా ఉండాల్సిన గేటుకు కనీసం తాళం వేయలేదు. ఈ స్థలం చివర ఉన్న చిన్న గదికి తలుపులు కూడా లేవు. ఇప్పటికే ఈ స్థలానికి ఉన్న విద్యుత్ మీటర్లు ఏమయ్యాయో కనిపించడంలేదు. ఈ స్థలం ఎవరిది అని తెలిపే బోర్డు సరిగ్గా కనిపించడంలేదు. దీంతో స్థలం అన్యాక్రాంతం అయ్యే ప్రమాదం ఉంది. ఇకనైనా స్థలానికి రక్షణ కల్పించి తగిన బోర్డును ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



అదృశ్యమైన శివప్రసాద్

పెందుర్తి: స్థానిక జేఎన్ఎన్‌యూఆర్ఎం(అయ్యప్ప) కాలనీకి చెందిన నరవ శివప్రసాద్ అదృశ్యంపై కుటుంబ సభ్యులు పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాలనీలో నివాసం ఉంటున్న శివప్రసాద్ ఆరిలోవలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో బాయ్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 1న రాత్రి డ్యూటీకి అని వెళ్లిన అతడు తిరిగి ఇంటికి రాలేదు. దీంతో బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో తండ్రి వెంకట్రావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేష వస్త్రాలను అందించారు. ఆలయ ఏఈవో ఎస్.ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

ఘనంగా మధ్యాహ్నపమ్మ తల్లి తీర్థం



జిల్లా స్థాయి పోటీలలో ఉరకలేస్తున్న ఎడ్ల బళ్లు

దేవరాపల్లి: మండలంలోని బోయిలకింతాడ పంచాయతీ శివారు కొత్తూరులో మధ్యాహ్నపమ్మ తల్లి తీర్థం ఆదివారం ఘనంగా జరిగింది. స్థానిక ప్రజలు తెల్లవారుజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం జరిగిన జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. హోరాహోరీగా సాగిన ఈ పోటీలలో ప్రథమ స్థానంలో అర్జునగిరికి చెందిన పరవాడ నాయుడు ఎడ్లు, ద్వితీయ స్థానంలో చుక్కపల్లికి చెందిన మజ్జి రాజేష్ ఎడ్లు, తృతీయ స్థానంలో లక్కవరానికి చెందిన నేమాల నరేష్ ఎడ్లు నిలిచాయి. విజేతలకు వరుసుగా రూ.10 వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.4వేలు, రూ.2వేలు, రూ.వెయ్యి చొప్పున నగదు బహుమతులను నాయకులు, గ్రామ పెద్దలు అందజేశారు. రాత్రి ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.